
సాక్షి
నిజామాబాద్
బుధవారం । 19 । మార్చి । 2025



ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపట్టేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

- 8లో ▸





వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ ద్వితీయంలో 475 మంది గైర్హాజరు

- నేటితో ముగియనున్న ఫస్టియర్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో మొత్తం 16,766 మంది విద్యార్థులకు 16,291 మంది హాజరుకాగా, 475 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాలకు 54 కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. కాగా, నేడు (బుధవారం) ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగియనుండగా, గురువారం ద్వితీయ సంవత్సర పరీక్షలు పూర్తికానున్నాయి.

చిరుత కోసం గాలింపు



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని జానకంపేట, ఠాణాకలాన్, నవీపేట్ మండలంలోని అబ్బాపూర్ అటవీ ప్రాంతాల్లో చిరుత పులి కోసం మూడు బృందాలు గాలింపు చేపట్టాయి. జానకంపేట సీటీసీతో పాటు అటవీ ప్రాంతాల్లో రెండురోజులపాటు పరిశీలించిన అధికారులు చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పంట పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు. బృందంలో సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, బీట్ ఆఫీసర్ ప్రవీణ్, ఫారెస్టు అధికారులు ఉన్నారు.

ఏప్రిల్ 27న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష


నిజామాబాద్ అర్బన్: మోడల్ స్కూల్ అడ్మిషన్లకు ఏప్రిల్ 27న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పదో తరగతికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లా సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ టి యాదగిరి రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీసీ వెంట న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి, అడిషనల్ కంట్రోలర్ టి సంపత్ ఉన్నారు. పరీక్షలకు 42 మందికి 33 మంది హాజరు కాగా 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ఎస్‌బీ ఏసీపీకి ఏఎస్పీగా పదోన్నతి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ శ్రీనివాస్ రావుకు అదనపు ఎస్పీగా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం 15 మంది ఏసీపీలకు పదోన్నతులు కల్పిస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన ఏసీపీలను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, వేదికపై కార్యదర్శి భవాని శ్రీ, రీసెర్చ్ డైరెక్టర్ రేమాశ్రీ, అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

పసుపు రైతుకు నిరంతర సేవలు

- మధ్యవర్తిత్వం లేని అమ్మకాలకు కృషి
- కర్షకులు రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసుకోవాలి
- విలువ ఆధారిత ఉత్పత్తులతో మరింత మేలు
- ట్రేడర్లు, అంతర్జాతీయ ఎగుమతిదారులతో రైతులకు అనుసంధానం
- జిల్లాలో పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- రైతులు, ట్రేడర్ల సమావేశంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు రైతులు తాము పండించిన పంటకు అదనపు విలువ జోడించి, 'విలువ ఆధారిత ఉత్పత్తి'ని తీసుకురావాలని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి సూచించారు. ఇందుకోసం రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో)లను మరింతగా ప్రోత్సహించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. మంగళవారం నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఆధ్వర్యంలో పసుపు రైతులు, ట్రేడర్ల అనుసంధాన సమావేశం నిర్వహించారు. చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ రైతులు ఎఫ్‌పీవోలుగా ఏర్పడాలన్నారు. దీంతో ఎగుమతిదారులతో నేరుగా వ్యాపారం చేసేలా ఎదగొచ్చన్నారు. ప్రపంచంలో అత్యధికంగా 80 శాతం పసుపు భారత్‌లోనే రైతులు పండిస్తుండగా, ఇందులో 90 శాతం తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల రైతులే పండిస్తున్నారన్నారు. 2023–24 సీజన్‌లో భారత్ నుంచి 226.58 మిలియన్ డాలర్ల విలువైన 1,62,018 టన్నుల పసుపును ఎగుమతి చేశామన్నారు. 2023–24 సీజన్‌లో దేశంలో 3.05 లక్షల హెక్టార్లలో రైతులు పసుపు సాగు చేశారన్నారు. 10.74 లక్షల టన్నుల ఉత్పత్తి వచ్చిందన్నారు. పసుపునకు ఉన్న ప్రాధాన్యత నేపథ్యంలో సుగంధ ద్రవ్యాల బోర్డు నుంచి విడదీసి ప్రత్యేకంగా నిజామాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేసిందన్నారు. పసుపు బోర్డు ద్వారా రైతులకు, ట్రేడర్లు, అంతర్జాతీయ ఎగుమతిదారులతో నిరంతరం అనుసంధానం చేస్తామన్నారు. పసుపు బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 23న నాగ్‌పూర్, 24న చెన్నై, 26న మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లలో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నిజామాబాద్, చుట్టుపక్కల జిల్లాల్లో పండిస్తున్న పసుపునకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందన్నారు. దీంతో ఎంపీ ధర్మపురి అర్వింద్ పట్టుబట్టి మరీ ఇందూరుకు పసుపు బోర్డు తీసుకొచ్చారన్నారు. ఈ బోర్డు కార్యకలాపాలను విడతలవారీగా విస్తరించుకుంటూ వస్తామన్నారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి పసుపు మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులకు, ఎగుమతిదారులకు నేరుగా లింక్ ఏర్పాటు చేసే లక్ష్యంతో ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ఇకమీదట నిరంతరం పసుపు బోర్డు ద్వారా అన్నిరకాలుగా పూర్తి సహకారం, ప్రోత్సాహం ఉంటుందన్నారు. జిల్లాలో పసుపు బోర్డు కార్యకలాపాలు విస్తరించిన తరువాత పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఎఫ్‌పీవోలతో పాటు ఒక్కొక్క రైతును సైతం ప్రోత్సహిస్తామన్నారు. రైతులను నేరుగా ట్రేడర్లు, ఎగుమతిదారులతో లింక్ చేసేందుకు నిరంతరం సమన్వయ సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త వంగడాల కోసం రీసెర్చ్, ఉద్యాన శాఖ, ఎంఎస్ఎంఈ, ట్రేడర్లు, ఎగుమతిదారులతో రైతులను అనుసంధానం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. మధ్యవర్తులు, ఏజెంట్లు లేకుండా వ్యవస్థను పటిష్టం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో స్పైసెస్ బోర్డు, టర్మరిక్ బోర్డు రీసెర్చ్ డైరెక్టర్ రేమాశ్రీ, జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, శాస్త్రవేత్తలు, నాబార్డ్, జిల్లా పరిశ్రమల కేంద్రం బాధ్యులు, రైతులు, 80 మంది ట్రేడర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సలహాలను స్వీకరిస్తాం



రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి అన్నిరకాల సేవలందిస్తామని పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీ అన్నారు. రైతుల నుంచి వచ్చిన సలహాలను సైతం స్వీకరిస్తామన్నారు. ఏళ్లతరబడి పంటలు పండిస్తున్న రైతులు ఇచ్చే సలహాలు అందరికీ ఉపయోగపడేలా అమలు చేస్తామని ఆమె తెలిపారు.



పాల్గొన్న రైతులు, ట్రేడర్లు



వివిధ రకాల పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న ట్రేడర్లు

సదస్సులో ట్రేడర్లు, ఎగుమతిదారులు రైతులతో నేరుగా ఇంటరాక్ట్ అయ్యారు. రైతులు తీసుకొచ్చిన వివిధ రకాల పసుపు శాంపిళ్లను పరిశీలించారు. క్వాలిటీ పరీక్షలు చేశారు. పలువురు రైతులతో ఎగుమతిదారులు ఒప్పందాలు చేసుకున్నారు.

వివాదాలకు కేరాఫ్‌గా అధికారులు

- అధికారుల నిర్లక్ష్యంపై నిప్పులు చెరుగుతున్న బీజేపీ నేతలు
- ఆర్‌టీఐ దరఖాస్తులను పట్టించుకోవడంలేదని అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే కేవీఆర్
- పసుపు బోర్డు ప్రారంభ సమావేశానికి సహకరించని కలెక్టర్
- కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనీయలేదు : బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో సుదీర్ఘకాలం సర్వీసులో ఉండే బ్యూరోక్రాట్లు, అధికారులు, ఉద్యోగులు నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన నేపథ్యంలో తరచూ వివాదాస్పదం అవుతున్నారు. ఈ విషయమై ఉమ్మడి జిల్లాలో బీజేపీ నేతలు ఆయా అధికారుల వ్యవహారశైలిపై బహిరంగంగానే నిప్పులు చెరుగుతున్నారు. దీంతో ఈ విషయాలు సాధారణ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఇలా వివాదాలకు కేరాఫ్‌గా మారుతుండడం పట్ల విమర్శలు వస్తున్నాయి.

✤ తాజాగా నిజామాబాద్‌లో కేంద్ర వాణిజ్య పన్నుల శాఖ పరిధిలోని పసుపు బోర్డు సమావేశంలో చైర్మన్ పల్లె గంగారెడ్డి నేరుగా జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుపైనే విమర్శలు సంధించారు. జనవరిలో పసుపు బోర్డు తాత్కాలిక కార్యాలయాన్ని వర్చువల్ విధానంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్‌లోనే నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించగా పండుగ సమయంలో ఎవరూ అందుబాటులో ఉండరంటూ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తిరస్కరించారని గంగారెడ్డి అధికారిక సమావేశంలోనే తెలిపారు. కొన్ని అపోహలు తొలగించేందుకు ఈ విషయాన్ని జిల్లా ప్రజలకు తెలపాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. దీంతో అక్కడకు వచ్చిన రైతులు, ఉన్నతాధికారుల్లో చర్చ జరిగింది. ఇదిలా ఉండగా మంగళవారం జాతీయ పసుపు బోర్డు ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్న సమావేశం గురించి సైతం జిల్లా పౌరసంబంధాల అధికారికి తెలియకపోవడం గమనార్హం.

✤ జక్రాన్‌పల్లి మండలంలోని లక్ష్మాపూర్‌లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్ విషయమై కేఆర్ సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి వివరాలు తీసుకుని కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ కిరణ్‌లకు ఫిర్యాదులు చేశారు. అక్రమ క్రషర్ నిర్వాహకుడికి అనేకసార్లు నోటీసులు ఇచ్చారు. చర్యలు తీసుకోలేదని అడిగితే ఆ విషయమే తమకు తెలియదని చెబుతున్నారని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై సీఎంకు ఫిర్యాదు చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

✤ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శాసనసభలోనే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. కామారెడ్డిలో విద్య, వైద్య శాఖల్లో వివిధ అంశాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద 86 దరఖాస్తులు ఇస్తే ఏమాత్రం సమాధానాలు ఇవ్వలేదన్నారు. పైగా తానే స్వయంగా దరఖాస్తు ఇవ్వడానికి వెళితే ఇలాంటివి చాలా చూశాం.. అయ్యేవా.. పోయేవా అంటూ ఉద్యోగులు, అధికారులు మాట్లాడారన్నారు. అధికారులకు ఇది మంచి పద్ధతి కాదన్నారు. సదరు అధికారుల పేర్లు సైతం చెప్పగలుగుతానన్నారు. సమాచారం అధికారులు ఇచ్చేది లేదని చెబితే ఎలా అన్నారు. ప్రతీది ఫైల్‌తో సహా తనవద్ద ఉందన్నారు. అధికారులు గౌరవంగా వ్యవహరిస్తే బాగుంటుందన్నారు. ఈ ప్రవర్తన అందరికీ సిగ్గుచేటన్నారు. పద్ధతి మార్చుకోకుండా రాబోయే కాలంలో తన పద్ధతి మార్చుకునేలా చేస్తారా అని అసెంబ్లీలో నిప్పులు చెరిగారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో ఓడినవారు, నియోజకవర్గం నుంచి పారిపోయిన వారి పేరిట ప్రతిపాదనలు ఇవ్వడమేమిటి.. ఇన్‌చార్జి మంత్రి మంజూరు చేయడమేమిటన్నారు. ఇలా అయితే ప్రజలచే ఎన్నుకోబడిన తానేం చేయాలంటూ పరోక్షంగా షబ్బీర్ అలీపై కేవీఆర్ విమర్శలు ఎక్కుపెట్టారు.

నేడు జీజీహెచ్ డైట్ టెండర్

- పాతవారికే అప్పగించేందుకు అధికారుల మొగ్గు
- లక్కీ డ్రా కోసం పట్టుబడుతున్న టెండర్‌దారులు



నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో డైట్ టెండర్ అంశం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఏళ్ల తరబడిగా గుట్టుచప్పుడు కాకుండా టెండర్ ప్రక్రియ కొనసాగగా.. సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో 2024 జూలై 11న డైట్ సప్లయ్ టెండర్ విడుదల చేసి అదే నెల 16వరకు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వివిధ కారణాలతో మూడుసార్లు టెండర్లు వాయిదా పడుతూ వస్తోంది. కాగా, టెండర్‌లో అర్హత ఉన్న ఐదుగురు సభ్యులతో మంగళవారం సాయంత్రం అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ చాంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. కాగా, అధికారులు మాత్రం ప్రస్తుతం ఉన్న వారికే డైట్ సప్లై టెండర్ అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఏళ్ల తరబడి అనుభవం, బిల్లులు సకాలంలో మంజూరు కాకపోయినా డైట్ సప్లై చేస్తారని చెబుతున్నారు. కానీ, మిగతా టెండర్‌దారులు మాత్రం లక్కీ డ్రా తీయాలంటూ పట్టుబడుతున్నారు. 'టెండర్ ప్రక్రియ ఇప్పటికే ఆలస్యమవుతుంది. ఏది ఏమైనా అధికారులు బుధవారం టెండర్ ఫైనల్ చేసి తీరుతాం' అని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- అసెంబ్లీలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న 50వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నిజామాబాద్ నగర సమస్యలపై ఆయన మంగళవారం అసెంబ్లీలో మాట్లాడారు. నగరంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ.4 కోట్లు మంజూరు చేయాలని, వాటిని రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. కేంద్రప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రధాని మోదీ ఫొటో తప్పక ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ వర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌ను ఆధునీకరించేందుకు నిధులివ్వాలని తెలిపారు. ఐటీ హబ్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- లోపలికి వెళ్లేందుకు అంగన్‌వాడీల యత్నం
- అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు
- నిరసనకారులతో మాట్లాడిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

నిజామాబాద్ అర్బన్: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. వాగ్వాదాలు, తోపులాటలు, అరెస్టులు చోటు చేసుకున్నాయి. కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు మంగళవారం మెరుపు ముట్టడి చేపట్టారు. ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున అంగన్‌వాడీ టీచర్లు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు గేట్లు మూసేసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సీఐటీయూ నాయకులతోపాటు పలువురిని పోలీసులు అరెస్టు చేయగా అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏసీపీ రాజా వెంకటరెడ్డి, రూరల్ సీఐ సురేశ్ ఆధ్వర్యంలో నిరసనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కి తరలించారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలంటూ అంగన్‌వాడీలు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకోగా, కాసేపు తోపులాట జరిగింది. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు నిరసన ప్రాంతానికి చేరుకొని అంగన్‌వాడీలతో మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అయినా కూడా అంగన్‌వాడీలు వినకుండా ప్రవేశమార్గం వద్ద మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిరసన కొనసాగించారు. దీంతో కలెక్టరేట్‌లోనికి వెళ్లే ఉద్యోగులు బయటే నిలబడిపోయారు. అనంతరం పోలీసులు భారీ బందోబస్తుతో ఆందోళనకారులను నిలువరించారు.



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్



అంగన్‌వాడీ టీచర్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

పంట రుణాలకు ప్రాధాన్యమివ్వాలి

- జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్



బ్యాంకర్ల రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్, అధికారులు

నిజామబాద్ అర్బన్: పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యమివ్వాలని, రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్, రబీ సీజన్లకు కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, రానున్న సీజన్‌లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై బ్యాంకుల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉన్నాయని అన్నారు. వందశాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఇబ్బంది లేకుండా అర్హత కలిగిన రైస్‌మిల్లర్లకు వెనువెంటనే బ్యాంకు గ్యారెంటీలను మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు యూనిట్ల స్థాపన కోసం రుణాలు అందించాలన్నారు. సమావేశంలో ఆర్బీఐ ఎల్‌డీవో పఠ్వీ, డీఆర్డీవో సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ అశోక్ చవాన్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సాగర్'లో డేంజర్ బెల్స్!

- ఎస్సారెస్పీలో వేగంగా తగ్గుతోన్న నీటిమట్టం
- ప్రాజెక్ట్‌లో ప్రస్తుత నీటి నిల్వ 23 టీఎంసీలు
- రోజుకు 0.7 టీఎంసీల వినియోగం
- ఆయకట్టుకు మరో 15 టీఎంసీల నీరు అవసరం



ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయంలో వేగంగా తగ్గుతున్న నీటిమట్టంతో ఈ సంవత్సరం డేంజర్ బెల్స్ మోగేలా ఉన్నాయి. ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుండడంతో నీటి నిల్వ క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ప్రతి రోజు 0.7 టీఎంసీల నీరు ఆయకట్టుతోపాటు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. యాసంగి ప్రణాళిక ప్రకారం ఆయకట్టుకు మరో 22 రోజులపాటు నీటిని విడుదల చేయాలి. అందుకు 15 టీఎంసీల నీరు అవసరం. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 23 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అందులో 5 టీఎంసీలు డెడ్‌స్టోరేజీకి పోగా, మిషన్ భగీరథకు 1.6 టీఎంసీలు, ఆవిరి రూపంలో 2.8 టీఎంసీల నీరు పోతుంది. చివరికి ప్రాజెక్ట్‌లో మిగిలేది 14 టీఎంసీల నీరు మాత్రమే. దీంతో ఆయకట్టుకు నీటి విడుదలలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. వచ్చే ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురువక పోతే తాగునీటికీ తిప్పలు తప్పేలా కనిపించడం లేదు.

చివరి ఆయకట్టు కోసం..

చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలంటే నిరంతరం కాలువల ద్వారా పరిమాణం తగ్గించకుండా నీటి విడుదల కొనసాగించాలి. దీంతో నీటి ఆవిరి కూడా ఎక్కువగానే అవుతుంది. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు రికార్డుల్లో తెలుపుతున్నారు. కానీ, కాలువలో ఏడు వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఎల్‌ఎండీ ఎగువ ఉన్న చివరి ఆయకట్టు వరకు నీరు అందాలంటే ఎక్కువ మొత్తంలోనే నీటి ప్రవాహం ఉండాలి.



కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

కొనసాగుతున్న నీటి విడుదల

ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టు కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 5500, వరద కాలువ ద్వారా 500, సరస్వతి కాలువ ద్వారా 700, లక్ష్మి కాలువ ద్వారా 250, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 463 , గుత్ప లిఫ్ట్ ద్వారా 270, ముంపు గ్రామాల లిఫ్ట్‌ల ద్వారా 312, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 537 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1070.10(23 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఎలాంటి ఇబ్బంది లేదు

ఎస్సారెస్పీ నుంచి ఆయకట్టుకు, తాగునీటి అవసరాలకు నీటి విడుదలలో ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రస్తుతం పంటల కోసం 13 టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. రైతులు అధికారులతో సహకరించి నీటిని పొదుపుగా వాడాలి. చివరి ఆయకట్టుకు వరకు నీరు అందేలా సహకరించాలి.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

క్లుప్తంగా

కాలువ వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు



బాన్సువాడ రూరల్: నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా నీటిని వదిలిన ప్రతిసారి ఎక్కడో ఓ చోట నీటి ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఇటీవల సంగ్రాం తండాకు చెందిన సిద్దార్థ అనే 19 ఏళ్ల యువకుడు నీటిప్రవాహంలో కొట్టుకుపోయి తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చాడు. వరుస నీటిప్రమాదాలతో స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్టపై ప్రమాదం పొంచి ఉందంటూ హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అంకిత భావంతో పనిచేయాలి



కామారెడ్డి క్రైం: అంకిత భావంతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఎంపికైన స్టాఫ్ నర్సులు, వాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ లకు మంగళవారం తన చాంబర్ లో నియామక పత్రాలను కలెక్టర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగంలోకి వచ్చిన వారు అంకిత భావంతో పనిచేయాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన 26 మందికి , వాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ గా ఒకరికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, సబ్ యూనిట్ అధికారి చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీవో, సెక్రెటరీకి మెమోలు

సాక్షి ఎఫెక్ట్..

గాంధారి(ఎల్లారెడ్డి): జిల్లాలో తాగునీటి సమస్యలపై 'సాక్షి'లో 'గొంతు తడిసేదెలా?' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. తాగు నీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో గాంధారి ఎంపీవో లక్ష్మీనారాయణ, సోమ్లానాయక్ తండా పంచాయతీ కార్యదర్శి దేవీసింగ్‌కు కలెక్టర్ మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. సోమ్లానాయక్ తండాను అధికారులు సోమవారం సందర్శించి విచారణ చేపట్టారు. పరిస్థితులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు.

కందకుర్తి సందర్శన



రెంజల్: మండలంలోని కందకుర్తి గ్రామాన్ని తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జీ మంగళవారం సందర్శించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న స్మృతి మందిరం, స్కందాలయంతో పాటు స్వయంభూ రామ మందిరాన్ని దర్శించారు. నిర్మాణ పనుల గురించి స్థానిక ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. రామాలయం వైభవాన్ని ఆయనకు వివరించారు. కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, బస్వా లక్ష్మీనర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గోపికృష్ణ, మేక సంతోష్, ఈర్లరాజు, ప్రసాద్, రంజిత్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆధ్వర్యంలో నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు దుకాణాల ముందు ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణలను మంగళవారం తొలగించారు. కొంతకాలంగా దుకాణాల యజమానులు, చిరు వ్యాపారులు అక్రమంగా కబ్జా చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేశారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయకర్త సత్యనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ బాలబాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, ఈబీసీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 20న నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వారిని, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 31 ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

అనాథ వృద్ధులను వృద్ధాశ్రమంలో చేర్పించాలి



రాంపూర్‌లోని వృద్ధాశ్రమం



రెడ్‌క్రాస్ కార్యాలయంలో తలసేమియా పిల్లలకు ఉచిత రక్తమార్పిడి సేవలందిస్తున్న దృశ్యం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత పిల్లలకు ఉచిత వైద్య సేవలు

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం, రెడ్‌క్రాస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధుల కోసం డిచ్‌పల్లి మండలం రాంపూర్‌లో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అనాథ వృద్ధులను గమనిస్తే రాంపూర్‌లో నూతనంగా ప్రారంభించబడిన వృద్ధాశ్రమంలో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, అందుబాటులో ఉంటే ఆరోగ్య సంబంధిత ఫైల్, సంబంధిత జీపీ నుంచి అనాథ వృద్ధులే అని ధ్రువీకరణ పత్రము, వృద్ధులను వృద్ధాశ్రమంలో చేర్పించే వారి పూర్తి వివరాలు, మొబైల్ నంబర్‌తో దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. జిల్లా వృద్ధుల, శిశు సంక్షేమ అధికారి కార్యాలయం, ఖలీల్‌వాడీ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయం, రాంపూర్‌లోని ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సంప్రదించి వృద్ధులను ఆశ్రమంలో చేర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆశ్రమానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం 9849933300, 8688887004, 9618844461 నంబర్లను సంప్రదించవచ్చని అన్నారు.

తలసేమియా బాధితులకు రక్తమార్పిడి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, నిజామాబాద్ శాఖ భవనంలో తలసేమియా వ్యాధి రక్త మార్పిడికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రక్త మార్పిడి చేయబడుతుందని, ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఐదేళ్లు దాటిన తలసేమియా బాధితులు ఉచిత వైద్య సేవలు పొందేందుకు రేషన్, ఆధార్ కార్డు తప్పనిసరి అన్నారు. ఐదేళ్ల లోపు బాలలకు సంబంధించి వాళ్ల పేరెంట్స్ రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక రోజు ముందు ఫోన్ చేసి బుకింగ్ చేసుకోవాలని, ప్రస్తుతం మంగళ, గురు, శనివారాల్లో రక్త మార్పిడి ఉంటుందని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి



జైతాపూర్‌లో ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ఎడపల్లి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ఎడపల్లి మండలం జైతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలన చేపట్టారు.

గ్రామంలో ఎన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని కలెక్టర్ ఆరా తీశారు. మొత్తం 125 మందికి మంజూరు కాగా, వారిలో 25 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని అధికారులు తెలిపారు. మిగతా లబ్ధిదారులు సత్వరమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ఎడపల్లిలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూం లను సందర్శించి బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు, వంట నూనె, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. వండిన అన్నం, వంటలను పరిశీలించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఎడపల్లి: మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్ వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ సీఐ అంజయ్య, స్పెషల్ పార్టీ సిబ్బంది మంగళవారం దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకోగా వారి నుంచి రూ. 15,780 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రెండు బోరు మోటార్ల చోరీ

మాచారెడ్డి: పాల్వంచ మండల శివారులోని ఇద్దరు రైతుల బోరు మోటార్లను గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి దొంగిలించినట్టు ఎస్సై అనిల్ తెలిపారు. గ్రామానికి చెందిన గాలి బొందయ్య, కొండె శ్రీనివాస్‌లకు చెందిన వ్యవసాయ భూమిలోని బోరు మోటార్లతో పాటు వైర్లను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రేపు సీజ్ చేసిన ఇసుక వేలం

నందిపేట్: మండలంలోని తల్వేద శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ వసంత రావు పేర్కొన్నారు. గ్రామ శివారులో వాగు నుంచి అక్రమంగా తరలించిన 120 ట్రాక్టర్ల ఇసుకను కొందరు నిల్వ ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు రెవెన్యూ అధికారులు సీజ్ చేసినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.20 వేలు దరావత్తు చెల్లించాల్సి ఉంటుందని డీటీ పేర్కొన్నారు.

ఆర్మూర్ డిగ్రీ కళాశాలలో కార్యశాల



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఔషధ రూపకల్పనపై ప్రత్యేక కార్యశాల(వర్క్‌షాప్) నిర్వహించారు. ఈ సందర్భంగా తెయూ రసాయనశాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ బాల్‌కిషన్ హాజరై విద్యార్థులకు ఔషధాల ఆవిష్కరణ అవసరం, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఔషధాన్ని రూపొందించడంలో అనుసరించాల్సిన పద్ధతులు, పరిశోధనలో ఎదురయ్యే సవాళ్లు వాటిని అధిగమించే వినూత్న సాంకేతికతల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుప్రసాద్, సునీల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన రామగళ్ల దశరథం(38) అనే వ్యక్తి మృతదేహం మంగళవారం సాయంత్రం లభ్యమైంది. మహమ్మద్‌నగర్ మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన దశరథం సోమవారం గ్రామ శివారులోని ప్రధాన కాలువలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం అగ్నిమాపక సిబ్బంది ప్రధాన కాలువ నీటిలో గాలించారు. సింగీతం గ్రామ శివారులోని ప్రధాన కాలువ బ్రిడ్జి వద్ద మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ నూర్జహాన్ మంగళవారం తీర్పు ఇచ్చినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పీఎస్‌ల పరిధిల్లో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిని పోలీసులు పీఎస్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో హాజరుపర్చారు. జడ్జి తొమ్మిది మందికి జైలు శిక్ష విధించగా మరో 33 మందికి జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. తొమ్మిది మందిలో ఆరుగురికి రెండు రోజుల జైలు, ముగ్గురికి ఒక రోజు జైలు శిక్షను జడ్జి విధించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు.

పబ్లిక్ న్యూసెన్స్ కేసులో ఎనిమిదికి ఒకరోజు..

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలో పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడ్డ ఏడుగురిపై ఒక రోజు జైలు శిక్షను విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. బోధన్ పట్టణంలోని ఆజాంగంజ్ కాలనీలో పక్కపక్కన ఉండే ఇరు కుటుంబాలు చిన్న విషయంలో గొడవ పడి పబ్లిక్ న్యూసెన్స్ చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరు కుటుంబాల సభ్యులను అరెస్టు చేసి జడ్జి ఎదుట హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఇరు కుటుంబాలలోని ఏడుగురితో పాటు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మరో వ్యక్తికి జడ్జి ఒక రోజు జైలు శిక్షను విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మాచారెడ్డి: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన బానోత్ పద్మ(43) అంగవైకల్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తితో ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించింది. కొద్ది సేపటికి విషయాన్ని గమనించిన కుటుంబీకులు సిరిసిల్లా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

దాడి చేసిన ఇద్దరికి జరిమానా

నందిపేట్: ఆస్తి తగాదాల్లో కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడిన ఇద్దరికి రూ. పది వేల చొప్పున జరిమానాను విధిస్తూ ఆర్మూర్ జడ్జి వేముల దీప్తి తీర్పు ఇచ్చినట్లు నందిపేట ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. 2019లో నందిపేట మండలం కుద్వాన్‌పూర్‌లో ఆస్తి పంపకాల విషయంలో తండ్రీ కొడుకులైన గోజూర్ పోశెట్టి, గోజూర్ గంగాధర్ తన కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు నాటి ఎస్సై రాఘవేందర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏపీపీ రామకృష్ణ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులపై నేరం రుజువు కావడంతో సదరు వ్యక్తులపై ఒకొక్కరికి రూ. పది వేలు చొప్పున విధిస్తూ జడ్జి దీప్తి జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో సంజన

భిక్కనూరు: జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలైన ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామ శివారులో మంగళవారం వేకువజామున చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఈసీఎల్ ప్రాంతానికి చెందిన అనంత్(23), సంజన స్నేహితులు. వీరు సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చి మంగళవారం వేకువజామున తిరిగి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా జంగంపల్లి శివారులోని జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో అనంత్ అక్కడికక్కడే మృతి చెందగా సంజనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సంజనను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, అనంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో..

సదాశివనగర్: షార్ట్ సర్క్యూట్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలం ఉత్తునూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుడిసె సతీశ్(25) మంగళవారం ఉదయం పొలంలో మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. పిచికారీ కోసం కావాల్సిన నీటిని తెచ్చేందుకు తన వ్యవసాయ బావిలోకి దిగాడు. బావిలో ఉన్న మోటర్ వైర్ తెగి నీటిలో పడిపోయింది. ఈ విషయాన్ని గమనించని సతీశ్ నీటిని తీసుకుంటుండగా కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లయిన పదమూడు రోజులకే మృత్యు ఒడికి..

- చెరువులో పడి యువకుడి మృతి



సదాశివనగర్: పెళ్లయిన పదమూడు రోజులకే ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కడమంచి రాములు(26) ఆరు నెలల క్రితం దుబాయి నుంచి వచ్చాడు. ఈ నెల 6న మెట్‌పల్లికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని పాత చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన రాములు ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు. రాములకు ఈత రాకపోవడంతోనే నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి మహిళ..



పిట్లం: ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన పిట్లం మండలం కిష్టాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నోళ్ల సత్యవ్వ(45) మంగళవారం ఉదయం 10 గంటలకు గ్రామ చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోవడంతో నీట మునిగి మృతి చెందింది. భర్త బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు..



దశరథ్ (ఫైల్)

మద్నూర్: ట్రాక్టర్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన మద్నూర్ మండలం చిన్న ఎక్లార గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. మద్నూర్ మండలం మేనూర్ గ్రామానికి చెందిన దశరథ్(25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న ఎక్లార శివారులో ట్రాక్టర్‌పై మట్టిని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ట్రాక్టర్ వెనుక చక్రాలు అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్, ఎస్సై ఎండీ షరీఫ్

డిచ్‌పల్లి: గంజాయి అమ్మిన, కొనుగోలు చేసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ తెలిపారు. మంగళవారం డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై ఎండీ షరీఫ్‌తో కలిసి సీఐ మల్లేశ్ మాట్లాడారు. మంగళవారం ఉదయం ఎస్సై తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సీఎంసీ మెడికల్ కాలేజ్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా కనిపించిన చిక్కలపల్లి శ్రీకాంత్, దర్భాషి నరేశ్‌ను తనిఖీ చేయగా వారి నుంచి 80 గ్రాముల గంజాయి లభించిందన్నారు. వారిని పీఎస్‌కు తరలించి విచారణ చేపట్టగా రూరల్ మండలం గుండారం శివారులోని రైస్‌మిల్‌లో పనిచేసే అరుణ్ సర్దార్ వద్ద నుంచి వీటిని కొనుగోలు చేసినట్లు అంగీకరించారు. దీంతో అరుణ్ సర్దార్‌ను పట్టుకుని విచారించగా అతడి వద్ద కూడా 60 గ్రాముల గంజాయి లభించిందన్నారు. ముగ్గురు నిందితుల నుంచి మొత్తం 140 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్ రాజేందర్ ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలో కోజ కాలనీలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆధ్వర్యంలో వన్ టౌన్ స్టేషన్ పరిధిలోని కోజ కాలనీలో బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 75 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని అధికారులకు, వాహనాన్ని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు. బొలెరో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇసుక టిప్పర్..

బోధన్ టౌన్: మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు టిప్పర్‌ను పట్టుకున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. బోధన్ పట్టణంలోని బెల్లాల్ రైల్వేగేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ టిప్పర్‌ను ఆపి పరిశీలించగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.